


వైద్యశిబిరాలను సందర్శించిన స్విమ్స్ డైరెక్టర్



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో స్వామివారి భక్తుల కోసం ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేసి, అవసరమైన వారికి వైద్యసేవలను అందిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి.కుమార్ తెలిపారు. అలిపిరి, శ్రీవారిమెట్టు వైద్యచికిత్స కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. బహ్మోత్సవాల సందర్భంగా స్విమ్స్ హాస్పిటల్ నుండి వైద్యులను, పారామెడికల్, నర్సింగ్ సిబ్బందిని అలిపిరి, శ్రీవారిమెట్టు వద్దనున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్‌కు డెప్యుటేషన్ మీద ఈనెల 18నుండి 26వ తేదీ వరకు రెండు షిఫ్టులలో ఉదయం 6 నుండి రాత్రి 8 గంటల వరకు 9 రోజుల పాటు భక్తుల కోసం వైద్యసేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

జీతం తక్కువ.. చాకిరి ఎక్కువ..

- పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి.. సమాన వేతనం ఎక్కడ..?
- ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగింపు
- 25న చల్లో విజయవాడ



రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి నగరం ప్రాముఖ్యత కలిగిన యాత్రాస్థలం. అంతేకాకుండా స్మార్ట్‌సిటి నేపథ్యంలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను చేపడుతున్నారు. నగరంలో నూతనంగా 12 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేశారు. దీనికి తోడు రూ.648కోట్లతో ఏడు కిల్లోమీటర్ల వరకు తిరుమలకు వచ్చే యాత్రికుల కోసం నిర్మించిన శ్రీనివాస సేతును సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ మధ్యే ప్రారంభించారు. తిరుపతి నగరపాలక జనభా మూడు లక్షలు ఉంటే రోజూ తిరుమల, తిరుపతికి లక్షమందికి పైగా యాత్రికులు వస్తూపోతూ ఉంటారు. అంటే దాదాపు రోజుకు నాలుగు లక్షల మంది.

ఇదిలా ఉండగా నగర పాలక సంస్థలో 1200 మంది కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 12 మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేయడం వల్ల కొంత పనిభారం పెరిగిందనే చెప్పవచ్చు. పారిశుధ్య కార్మికులకు సీనియార్టీని బట్టి రూ.18 నుంచి 15వేలు, రూ.12వేలు వేతనం ఇస్తున్నారు. ఇందులో ఇఎస్ఐ, పిఎఫ్ పేరుతో ఒక్కోక కార్మికుడికి సుమారు రూ.2వేల నుంచి రూ.2,500ల వరకు కోతలుపోనూ మిగిలిన జీతం చేతికి వస్తుంది.

రోజుకు ఎనిమిది గంటలు పనిచేసే పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు వీధుల్లో రోడ్లు ఊడ్చుడం, కాలువలు మురుగు తీయడం, రోడ్లో ఉన్న చెత్తను తొలగించడంతో పాటు ఇంటింటికీ వెళ్లి తడిపోడిచెత్త సేకరిస్తూ ఉంటారు. 1200 మంది పారిశుధ్య కార్మికులతో పాటు వార్డు అడ్మిన్లులు ప్రతి డివిజన్‌కు ఉంటారు. కార్పొరేషన్ పరిధిలో 101 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి 50 ఇళ్లకు వార్డు వాలంటీర్లు సుమారుగా రెండు వేలమంది ఉన్నారు.

ముఖ్యంగా తిరుపతి లాంటి నగరంలో నిత్యం విఐపిలు వస్తుపోతుంటారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్లు, ఇతర రాష్ట్రాల గవర్నర్లుతో పాటు ముఖ్యమంత్రులు, అలాగే వివిధ రాష్ట్రాల నుంచి స్వాములు, మఠాధిపతులు వస్తూ ఉంటారు. వీరి కోసం రాత్రిపగలు తేడా లేకుండా పారిశుధ్యకార్మికులు పనులు చేస్తూనే ఉంటారు. వరదలు, తుఫానులు వస్తే ఇక వీరు లేకపోతే ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి.

పండగలు వస్తే సెలవులు ఉండవు, అనార్యోగనికి గురైన సెలవులు ఉండవు. సెలవు పెడితే వారిస్థానంలో ఇంకోకరిని తీసుకోవచ్చి పనిలో పెడితే తప్ప సెలవులు ఇవ్వరు. కార్పొరేషన్‌లో ఇటీవల నూతనంగా శెట్టిపల్లి పంచాయతీ వీలీనం చేశారు. అక్కడ కూడా పారిశుధ్య పనులు చేయాలి. స్మార్టుసిటీ పథకంలో శ్రీనివాస సేతు 7 కిల్లోమీటర్ల వరకు బ్రిడ్జి నిర్మించారు. అక్కడ పారిశుద్య పనులు ఈకార్మికులే చేయాల్సిన పరిస్థితి వచ్చింది. శ్రీనివాస సేతు ఇటు చంద్రగిరి, అటు తిరుపతి నియోజకవర్గానికి వస్తుంది. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో వచ్చే శ్రీనివాససేతు మామిడి మార్కెట్ యార్డు నుంచి పారిశుధ్య పనులు ఎవరు చేయాలనేది ఇంతవరకు అధికార్లు నిర్ణయం తీసుకోలేదు.

2019 హామీలు అమలు ఎక్కడ..?

మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తామని అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చిన ముఖ్యమంత్రి అయిన తరువాత విస్మరించారని కార్మికులు వాపోతున్నారు. ఎన్నికల మ్యానిఫోస్టులో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ప్రకటించారు కానీ అమలుకు నోచుకోవడం లేదు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పి నేటికి అమలు చేయకపోగా అప్కాస్ పేరుతో జీతాలు పెంచకపోగా, రెగ్యులర్ గురించి ప్రభుత్వం మాట మాట్లాడడం లేదు.

ప్రశ్నిస్తే చర్యలు..

పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని కాంట్రాక్టు కార్మికులు ప్రశ్నిస్తే వారికి ఉద్యోగం నుంచి తొలగించి వేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. యూనియన్ నాయకుడు కూడా సరిగా పట్టించుకోవడం లేదనే కార్మికులు చర్చించుకుంటున్నారు. ఇటీవల సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరిన కార్మికులను పనిలో నుంచి తొలగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ అ ధికార్లు, యూనియన్ నాయకులు చెప్పినట్లు నడుచుకోవాలి. లేదంటే ఉద్యోగం ఊడినట్లే. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు అవస్థలు వర్ణతీతంగా ఉంది. కమిషనర్ దినిస్పందించి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- కందారపుమురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు తిరుపతి జిల్లాలో ఉన్న మున్సిపల్, పంచాయతీ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. వేతనలు పెంచకపోగా వారిచేత వెట్టిచాకిరి చేయించడం దారుణం. పారిశుధ్యకార్మికులకు అన్ని వసతులు కల్పించాలి. కార్మికుల సమస్యలు పరిష్కరం కోసం ఈనెల 25న విజవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

స్టాంపులు కోసం పడిగాపులు

- గంటల తరబడి ఎదురుచూస్తున్న బాధితులు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న కార్యాలయ సిబ్బంది
- ఇదీ సబ్‌రిజిస్టర్ కార్యాలయం పరిస్థితి



ప్రజాశక్తి -తొట్టంబేడు: ఇక్కడ దళారులకు ఎక్కువ ప్రాధాన్యత.. స్టాంపులు కొనడానికి కూడా లంచం ఇవ్వాల్సిందే.. కమిషన్ లేనిదే ఈ కార్యాలయంలో ఏ పని జరగదట.. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్టాంపులు తీసుకుంటే రూ.50లది 50 రూపాయలే కడుతారు. వంద రూపాయలు స్టాంపు తీసుకుంటే వంద రూపాయలు మాత్రమే కడతారు.. అయితే ఈ విధంగా రైతులకు.. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చిన బాధితులకు స్టాంపులు ఇస్తే వాళ్లకి ఏమీ ఆదాయం రాదని పక్కనే ఉన్న దళారుల దగ్గర స్టాంపులు తీసుకోవాలని చెబుతున్నారు. రిజిస్టర్ కార్యాలయంలో స్టాంపులు దొరకవు దళారుల దగ్గరే దొరకడం ఇక్కడ విశేషం.. ఎంతసేపు ఎదురుచూస్తూ.. పడి కాపులు కాసిన ఒకే ఒక్క స్టాంపు పత్రం కూడా ఇవ్వరు. ఇదేంటి అనీ ప్రశ్నిస్తే వాళ్లను బెదిరించి కార్యాలయం నుంచి తరిమేస్తారు. కొంతమంది రైతులు కార్యాలయం ఎదుటే బహిరంగంగా గొడవలకు దిగుతారు సబ్‌రిజిస్టర్ గాని, సిబ్బంది కానీ ఇంత జరుగుతున్న కార్యాలయ సిబ్బంది మాత్రం మాకెందుకులే అంటూ వ్యవహరిస్తుంటారు. ఇక్కడ కాసులు ఇస్తే ఏ పనైనా చేసేస్తారు. ముడుపులు ఇవ్వకపోతే రిజిస్ట్రేషన్ చేయకుండా సాకులు చెబుతారట.. ఎంతటి సమస్య ఉన్నా ముడుపులు అందిస్తే చాలు రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్ చేతిలో పెడతారని బహిరంగంగా పలువురు చర్చించుకుంటున్నారు. ఇది ఎక్కడో కాదండోయ్ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం సబ్‌రిజిస్టర్ కార్యాలయంలోనీ పరిస్థితి ఇది...

తొట్టంబేడు మండల కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న ధర్మరాజుల స్వామి గుడి వెనుక ఉన్న తొట్టంబేడు జాయింట్ సబ్ రిజిస్టర్ వారి కార్యాలయంలో స్టాంపులు కోసం, రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చిన బాధితులు గురువారం గంటల తరబడి నిలబడిన కూడా సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.. ఉదయం 10 నుంచి 12:30 గంటలకు కూడా రిజిస్టర్ ఆఫీస్‌కి వచ్చిన బాధ్యతలకు అధికారులు సమాధానం చెప్పలేదని వాపోయారు. బాధితులు స్టాంపులు అడుగుతుంటే రిజిస్టర్ ఆఫీస్‌లో పనిచేసే సిబ్బంది ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ ముఖం సాటేస్తున్నారు. పక్కనే ఉన్న దళారుల వద్ద వెళ్లి స్టాంపులు తీసుకోవాలని వారే బహిరంగ చెబుతున్నారు. దళారులు చేత కార్యాలయ సిబ్బంది స్టాంపులు అమ్మి ఇస్తున్నారని కార్యాలయ బయట గుసగుసలు వినిపిస్తున్నాయి. కమిషన్లకు అలవాటపడి ఇలా చేయిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తు కార్యాలయ సిబ్బంది పనితీరుపై పట్టించుకునే నాధుడే లేడా అని రిజిస్ట్రేషన్ కు వచ్చిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొట్టంబేడు సబ్ రిజిస్టర్ ను వివరణ కోరగా..

కార్యాలయంలో స్టాంపులు లేవు లేకపోతే ఎలా ఇవ్వగలుగుతాం అని అన్నారు. రైతులు అడుగుతున్నా కూడా ఎక్కడినుంచి తెచ్చి ఇవ్వగలము అని ఆయన వివరణ ఇచ్చారు ..అయితే అదే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం ఒకటిన్నరకు స్టాంపులు ఇవ్వడం గమనార్హం.

ప్రభుత్వం తొలగించినా..

మఠం ఆస్తిలో పాగా..!

ఆస్తిని అప్పజెప్పాలని నోటీసులిస్తున్నా డోంట్ కేర్ అంటున్న మిశ్రా



మిశ్రా ఉంటున్న మఠానికి సంబంధించిన భవనం

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): అతడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని హంథీరాంజీ మఠంకు చెందిన రెసిడెన్షియల్ భవనాన్ని తన మేనకోడలైన మనిష మిశ్రాకు లీజు ప్రతిపాదికన కట్టబెట్టాడు. వారి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం, ధార్మిక పరిషత్ పరిశీలించి మఠం మహంతుగా ఉన్న అర్జున్ దాస్‌ను సస్పెండ్ చేసింది. పరిపాలన వ్యవహారాలు పర్యవేక్షించిన విద్యార్థిప్రసాద్ మిశ్రాను గత దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ అర్జున్‌రావు హాయంలోనే తొలగించినా అర్జున్‌దాస్ అండతో మఠంలోనే తిష్ట వేసుకోని కూర్చుని తన పబ్బం గడుపుకుంటూ వచ్చాడు.

నేడు ధార్మిక పరిషత్ అర్జున్ దాస్‌పై ఆరోపణలు వాస్తవమేనని ధృవీకరించి సస్పెండ్ చేసినా అర్జున్‌దాస్ బంధువు అయిన విద్యార్థిప్రసాద్ మిశ్రా మాత్రం తనకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకొని తన మేనకోడలు పేరుపై లీజుతో పోంది (మఠంకు సంబందించిన ఆస్తి) అందులోనే నివాసం ఉంటూ లీజు ప్రతిపాదికన మఠంకు అద్దె చెల్లింపులు చేయడం లేదు. దీంతో హథీరాంజి మఠంకు ఫిట్ పర్సన్, డిప్యూటీ కలెక్టర్‌గా భాధ్యతలు స్వీకరించిన రమేష్ నాయుడు వెంటనే మఠంకు బకాయిపడ్డ నగదును రూ.8,07,997లను చెల్లించి భవనాన్ని ఖాళీచేయాలని తిరుపతి రామాలయం వీధిలోని డోర్ నెంబరు 7-1-10లో ఉన్న విద్యార్థిప్రసాద్ మిశ్రాకు నోటీసులు ఇవ్వడానికి వెళ్తే వారు ఇంటిలోనే ఉంటూనే గేటుకు తాళం వేసి నోటీసులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని ప్రజాశక్తి పరిశీలనలో తెలింది.

ఆ భవనాన్ని కూల్చివేయాలి....

మరోవైపు తిరుపతి నగర పాలకసంస్థ పరిధిలో పాత భవనాలను గుర్తించి కాలంచెల్లిన భవనాలను తప్పనిసరిగా కూల్చి వేయాలని ఆయా భవన యజమానులకు, అటువంటి భవనాలను కలిగి ఉన్న శాఖలకు నోటీసులు జారీ చేసింది. ఈక్రమంలో తిరుపతి రామాలయం వీధిలోని హథీరాంజి మఠంకు చెందిన భవనం (ప్రస్తుతం విద్యార్థిప్రసాద్ మిశ్రా)కు కూడా నోటీసులు ఇచ్చారు. ఈక్రమంలో ఆ భవనం స్వాధీనం చేసుకొని ఏదేనీ ప్రమాదం జరగక ముందే భవనాన్ని కూల్చి వేయాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా అందులో దౌర్జన్యంగా అద్దె చెల్లించకుండా నివాసం ఉంటున్న విద్యార్థిప్రసాద్ మిశ్రాకు నోటీసులు జారీచేస్తున్నా పట్టించుకోకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఖాళీ చేయిస్తాం...

- రమేష్ నాయుడు, ఫిట్ పర్సన్, డిప్యూటి కలెక్టర్, హథీరాంజి మఠం తిరుపతి

మఠంకు సంబంధించిన భవనంలో లీజు ప్రతిపాదికన ఉన్న విద్యార్థిప్రసాద్ మిశ్రాను ఖాళీ చేయించి భవనాన్ని స్వాధీనం చేసుకుంటాం. లీజు ద్వారా భవనాన్ని పొందిన మనిష మిశ్రా వాస్తవానికి ఇక్కడ లేరు. ఈ ఏడాది 6 నెలలోనే నోటీసులు ఇచ్చాం. కానీవారు ఇంటిలోనే ఉంటూ నోటీసులు తీసుకోకుండా మఠం సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్న మాట వాస్తవమే. పాత భవనం కావడంతో కూల్చి వేయడానికి కార్యచరణ రూపోందిస్తున్నాం.

కల్పవృక్ష వాహనంపై శ్రీ మలయప్ప

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయం శ్రీ మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల గోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు అభయమిస్తారు. ఈవాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారికి శ్రీవిల్లి పుత్తూరు మాలలు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లి పుత్తూరు నుండి గోదాదేవి మాలలు గురువారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దగల శ్రీ పెద్దజీయర్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. అక్కడ తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి, తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ సెల్లదొరై, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ ఈవో ముత్తురాజ, ట్రస్టుబోర్డు సభ్యుడు మనోహరన్ కలిసి ఆలయ మాడవీధుల గుండా మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఈవో ఎవి.ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవిల్లిపుత్తూరు నుండి గోదాదేవి మాలలను తిరుమల శ్రీవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వీటిని గరుడసేవలో స్వామివారికి అలంకరిస్తామని తెలిపారు.

భూదేవి అవతారం గోదాదేవి

శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు స్వామివారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవిల్లిపుత్తూరులోని శ్రీరంగమన్నార్ స్వామివారి ఆలయానికి గోదాదేవి తండ్రి శ్రీపెరియాళ్వార్ పుష్పకైంకర్యం చేసేవారని, రంగనాథునిపై అనన్యభక్తి కలిగిన శ్రీగోదాదేవి పూలమాలలను మొదట తాను ధరించి ఆ తరువాత స్వామివారికి పంపేవారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన పెరియాళ్వార్ తన కుమార్తెను మందలించారని, ఆ తరువాత గోదాదేవి ధరించకుండా పంపిన మాలలను శ్రీరంగనాథుడు తిరస్కరించారని పురాణ కథనం. గోదాదేవి శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారమని భావిస్తారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ స్థానాచార్యులు రంగరాజన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



22న గరుడ సేవకు ప్రత్యేక ఏర్పాట్లు

నిరంతరాయంగా అన్నప్రసాదాలు

గ్యాలరీల రీఫిల్లింగ్ ఏర్పాట్లు

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 22న శుక్రవారం జరుగనున్న గరుడసేవ రోజున విశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తతంగా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండే అవకాశముంది. గరుడసేవ దర్శనం కోసం ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్‌వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్‌గేట్, నార్త్, ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతించేలా అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గరుడ వాహనాన్ని రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా అర్ధరాత్రి 2 గంటల వరకైనా నెమ్మదిగా ముందుకు కదిలేలా ప్రణాళిక రూపొందించారు. గరుడసేవ దర్శనం కోసం బయట వేచి ఉండే భక్తులు తమవంతు వచ్చే వరకు సంయమనంతో వేచి ఉండి భద్రతా విభాగం నిబంధనలు పాటించాలని టిటిడి కోరడమైనది. మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8 నుండి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తారు. గ్యాలరీల్లోనూ ఉదయం నుండి రాత్రి వరకు పులిహోర, టమోటా బాత్, బిసిబెళాబాత్ తదితర అన్నప్రసాదాల ప్యాకెట్లు పంపిణీ చేస్తారు. భక్తుల కోసం 2.50 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేశారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో పరిశుభ్రత, కాటేజీలు, యాత్రికుల వసతి సముదాయాలు, సామూహిక మరుగుదొడ్ల వద్ద మెరుగైన పారిశుద్ధ్యం కోసం బ్రహ్మోత్సవాల రోజుల్లో అదనంగా 247 మంది, గరుడసేవ నాడు అదనంగా మరో 774 మందిని ఏర్పాటు చేశారు. భక్తుల కోసం నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 524 తాగునీటి డ్రమ్ములను ఏర్పాటుచేసి శ్రీవారి సేవకుల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలకు దాదాపు 1130 మంది టీటీడీ నిఘా, భద్రతా సిబ్బందితోపాటు 3,600 మంది పోలీసులతో పటిష్ఠంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. గరుడసేవకు ప్రత్యేకంగా 1200 మంది పోలీసులతో అదనపు భద్రత కల్పించారు. ఆలయ మాడ వీధులు, ఇతర ప్రాంతాల్లో 2,770 సిసి కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పర్యవేక్షిస్తారు. ఘాట్ రోడ్లలో భక్తుల భద్రతను దష్టిలో ఉంచుకుని గురువారం సాయంత్రం 6 గంటల నుండి సెప్టెంబరు 23వ తేదీ శనివారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ రద్దు చేసింది. తిరుపతిలోని అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద ద్విచక్ర వాహనాలను పార్క్ చేసుకునే సదుపాయాన్ని టీటీడీ కల్పిస్తోంది. భక్తులు ఈవిషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్‌టిసి బస్సుల్లో 3 వేల ట్రిప్పుల ద్వారా దాదాపు 3లక్షల మందిని తరలించేందుకు చర్యలు చేపట్టారు. భక్తులకు వైద్యసేవల కోసం మాడవీధుల్లో నాలుగు మూలల్లో మొబైల్ క్లినిక్‌లు, 7 అంబులెన్సులు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది ఏర్పాటు చేస్తారు. గరుడసేవ నాడు వాహనసేవను తిలకించేందుకు మాడ వీధులు, భక్తుల రద్దీ ఉన్న మ్యూజియం, వరాహస్వామి విశ్రాంతి గహం, అన్నదానం కాంప్లెక్స్, రాంభగిచా విశ్రాంతి గహం, ఫిల్టర్ హౌస్ ఇతర ప్రాంతాల్లో కలిపి 20 పెద్ద డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి దివ్యౌషధం

ఆచార్య కె.రాజారెడ్డి



చిరుధాన్యాల ప్రదర్శనశాలను ప్రారంభిస్తున్న ఆచార్య రాజారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్: మనిషి జీవితంలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవడమే శ్రేష్టమైన ఆరోగ్యానికి సోపానమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి పేర్కొన్నారు. గురువారం యస్వీయూ సెనేట్ హాల్లో ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విభాగం మరియు కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ రీసెర్చ్ అండ్ ట్రేడ్ ఇన్ ట్రెడిషనల్ ఫుడ్స్, న్యూఢిల్లీ సంయుక్తంగా నిర్వహించిన 'మిల్లెట్స్ ద సూపర్ ఫుడ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ అండ్ వెల్నెస్' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో వారు ముఖ్యఅతిథిగా వారు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియా చిరుదాన్యాల ఉత్పత్తి, ఎగుమతుల విషయంలో మంచి ప్రగతి సాధించిందని, కోవిడ్ సమయంలో చిరుధాన్యాలు ఎంతో మందికి ఆరోగ్యాన్నందించాయని, ఇవి మంచి పర్యావరణ స్నేహితులని అన్నారు. ఈ సందర్భంగా ఫుడ్ న్యూట్రిషియన్ విభాగం ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార ప్రదర్శనశాలను వారు ప్రారంభించారు. ఈ సదస్సులో డాక్టర్ హేమంత్ కుమార్, అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం, డాక్టర్ తారా సత్యవతి, ఐకార్, హైదరాబాద్, డాక్టర్ సురేందర్ ఘోంక్రొక్త అతిథి ఉపన్యాసాల ద్వారా చిరుధాన్యాలు శ్రేష్టమైన ఆరోగ్యాన్ని ఇస్తామన్నారు. ఈకార్యక్రమాన్ని హోమ్ సైన్స్ విభాగాధిపతి, యస్వీయూ పాలకమండలి సభ్యులు అయిన డాక్టర్ కె.మంజుల కన్వీనర్‌గా వ్యవహరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.తులసీ రామకష్ణారెడ్డి, హోమ్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ కెవి.సుచరిత, డాక్టర్ కె.అనురాధ, డాక్టర్ బి.స్వరూప రాణి, డాక్టర్ అనిత, డాక్టర్ నీరజ, డాక్టర్ సింధుజ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌విఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌విఆర్ షాపింగ్ మాల్‌ను తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. స్థానిక తీర్థకట్ట వీధిలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మగువలను ఆకర్షించే సరి కొత్త డిజైన్లతో, అన్ని రకాల శారీలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. పెద్దలకి, పిల్లలకి ఆకర్షణీయమైన సరికొత్తవి, అందరం మెచ్చే వస్త్రాలు లభిస్తాయన్నారు. నగర వాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షాపింగ్ మాల్ యజమానులు కేథారు, బద్రీనాథ్ మాట్లాడుతూ సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ధరలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరు శారీలు రూ.550కే, కంచి పట్టు చీరలు కంచి ధరలకే, రూ.499 లెనిన్ కాటన్ శారీ రూ. 219కే, 656 రూపాయల క్యాట్ లక్ శారీ, 950 రూపాయల వెంకటగిరి శారీ రూ.499, 1356 రూపాయల బంగ్లాదేశ్ కాటన్ శారీ రూ.599కే, 2396 రూపాయల కుప్పడం పట్టు శారీ రూ.899, 3299 పోచంపల్లి ఇక్కత్ శారి రూ. 1299, 4899 రూపాయల ఉప్పాడ పట్టు శారీ రూ.1899, 6895 రూపాయల స్పెషల్ పట్టు శారీ రూ.1399కే అందుబాటులో ఉంచామన్నారు. వీటితోపాటు గాగ్రాస్ లెహంగాస్ చుడిదార్స్ ఆఫ్ సారీస్ టాప్ లెగ్గిన్స్ పటేల్ డ్రెస్సెస్ డ్రెస్ మెటీరియల్స్ నైటీలు నైట్ డ్రెస్సులు ఇన్నర్ వేర్సు అన్ని లేటెస్ట్ మోడల్స్, పురుషులకు సంబంధించిన ఫార్మల్ షర్ట్స్ ఫార్మల్ పాయింట్స్ జీన్స్ టీషర్ట్స్ కొత్త పైజామాస్ దోతీలు పట్టు పంచలు, ఇన్నర్ వేర్స్ అన్ని రకాలు ఇక్కడ లభిస్తాయన్నారు. హోల్‌సేల్ ధరలకే వస్త్రాలు అందించడం మా ప్రత్యేకత అని తెలిపారు. లక్కీ టిప్ ద్వారా పట్టుచీర గెలుచుకునే అవకాశం కల్పించామని దీనిని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, షాపింగ్ మాల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో శ్రీ రామచంద్రా ఆసుపత్రి వైద్యసేవలు




ప్రజాశక్తి- వరదయ్యపాలెం: అక్టోబర్ మూడోవారం నుంచి శ్రీసిటీలో చెన్నైలోని శ్రీ రామచంద్రా ఆసుపత్రి వైద్యసేవలు ప్రారంభం కానుంది. ఈ మేరకు శ్రీసిటీ, శ్రీరామచంద్ర హాస్పిటల్ భాగస్వామ్యంపై ఇటీవల ఒక ఒప్పందం జరిగింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీరామచంద్ర విశ్వవిద్యాలయం ఛాన్సలర్ విఆర్.వెంకటాచలం అవగాహన ఒప్పందం (ఎంఓయు) పత్రాలను మార్చుకోవడం ద్వారా అధికారికంగా తమ భాగస్వామ్యాన్ని ప్రకటించారు. ప్రో-ఛాన్సలర్ ఆర్.వి.సెంగుతువాన్ కూడా ఇందులో పాల్గొన్నారు. శ్రీరామచంద్రా హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.బి.సుధాకర్ సింగ్ అవగాహన ఒప్పందం (ఎంఓయు) గురించి వివరిస్తూ, అనేక బహుళజాతి కంపెనీలకు నిలయమైన శ్రీసిటీ ప్రాంగణంలో అత్యున్నత ఆరోగ్య వైద్యసేవలను అందించడానికి తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఈ వైద్య కేంద్రంలో 24 గంటలూ డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అత్యవసర చికిత్సలు, యాక్సిడెంట్లుతో పాటు పరిశ్రమలలో ప్రమాదాలకు సంబందించి కూడా తాము వైద్య సేవలు అందిస్తామన్నారు. శ్రీ రామచంద్రా హాస్పిటల్‌తో భాగస్వామ్యం గురించి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రస్తావిస్తూ, శ్రీసిటీకి సంబంధించి ప్రతి అంశంలోనూ ప్రపంచస్థాయి సౌకర్యాలను అందించడం తమ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఆరోగ్య సేవల కోసం శ్రీరామచంద్ర ఆసుపత్రిని ఎంచుకున్నామని చెప్పారు. చెన్నైలోని అత్యుత్తమ ఆసుపత్రుల్లో ఇది ఒకటిగా పేర్కొన్న ఆయన, శ్రీసిటీకి మాత్రమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు ఈ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. శ్రీ రామచంద్రా ఆసుపత్రిచే ఈ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందుతాయన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. శ్రీసిటీ ప్రాంతవాసుల ఆరోగ్య అవసరాల మేరకు ప్రైమరీ కేర్, ప్రివెంటివ్ కేర్, ఆక్యుపేషనల్ హెల్త్, పీరియాడిక్ హెల్త్ క్యాంపులు, ఆన్-సైట్ వెల్నెస్ ప్రోగ్రామ్‌లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్, మెడికల్ ఎక్స్‌పర్ట్స్‌తో వీడియో కన్సల్టేషన్‌లు, ఫార్మసీ సేవలు మరిన్ని సమగ్రమైన వైద్య సేవలను వీరు అందిస్తారు. శ్రీరామచంద్ర గ్రూప్ చెన్నైలో అత్యాధునిక ఆసుపత్రితో పాటు అత్యుత్తమ వైద్య కళాశాలలు, ప్రపంచ స్థాయి పరిశోధనా కేంద్రాన్ని నిర్వహిస్తోంది.

తెలుగు సాహితీ వెలుగు గురజాడ



ప్రజాశక్తి-పాకాల: సాహిత్యాన్ని రాజుల రాజ ఆస్థానాల నుండి సామాన్య ప్రజల బాట పట్టించిన తెలుగు సాహిత్య వెలుగు గురజాడ అప్పారావు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ బాషా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో గురజాడ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషా ఉద్యమంలో గిడుగు రామ్మూర్తి కి గురజాడ అండగా నిలిచారన్నారు. తెలుగు అధ్యాపకులు కె ఈశ్వర బాబు మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకం రచన నేపథ్యం విశిష్ట ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించామన్నారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, స్త్రీ విద్య, వితంతు వివాహాలు, కుల వివక్ష వంటి విషయాలను సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేష్ బాబు, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



పుత్తూరు టౌన్ : ఆధునిక యుగకర్త గురజాడ అప్పారావు అని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ, కళాశాల, పుత్తూరులో ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' గొప్ప సాంఘిక నాటకమని, దీని ద్వారా సమాజంలోని దురాచారాలను గురజాడ ఖండించారని తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షులు పూజారి వెంకటేశన్ మాట్లాడుతూ గురజాడ బాల్యవివాహాలను వ్యతిరేకించడమే కాక వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారన్నారు. నవ్యకవిత్వానికి అడుగుజాడ అన్నారు. తెలుగు అధ్యాపకులు యం. ధర్మారావు ప్రసంగిం చారు. అనంతరం గురుజాడ దేశభక్తి గేయాన్ని విద్యార్థులు సామూహికంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి వెంకటేశన్, యం. ధర్మారావు, ఏ దేవకి, వి. వాసవి, యం శ్రీనివాసులు అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్నకి చెబుదాం'ను విజయవంతం చేయాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - బాలాయపల్లి : 'జగనన్నకి చెబుదాం..' కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న జగనన్నకి చెప్పు కుందాం కార్యక్రమాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజా సంక్షేమం కోసమై ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని సదుద్దేశంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి మన మండల కేంద్రంలో అన్ని శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు వచ్చి మీ ముంగిటే పరిష్కారం చేపట్టేందుకు జగన్ అన్నకి చెప్పుకుందాం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కార మార్గం చేపడుతారన్నారు. ఆయన వెంట ఎంపీడీవో , ఈవోపీఆర్డి, విద్యుత్ శాఖ జే ఈ వెంకటాద్రి, విద్యుత్ శాఖ అధికారులు, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలు వినియోగంతో ఆరోగ్యం


ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చిరుధాన్యాన్ని ఉపయోగిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో చిరుధాన్యాలు వినియోగం ఉపయోగంపై ఆవశ్యకతపై జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. నేడు జిల్లాస్థాయిలో పోటీలకు గెలుపొందిన కె అఖిల్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : విద్యార్థులు క్రీడల్లో రాణించాలనిస్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ పేర్కొ న్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్ర మంలో భాగంగా గూడూరు లోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఎస్.జి.ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడాపోటీలకు ముఖ్య అతిథులుగా స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ, ఆర్డీవో కిరణ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ మండలాల స్థాయిలో గెలుపొందిన క్రీడా కారులకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభ కనపరిచి జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరిచి గూడూరుస్థాయిని పెంచాలన్నారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించి గూడూరుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారని, అందరూ బాగా ఆడాలని పేర్కొన్నారు. ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లా డుతూ విద్యార్థులకు మూడు ప్రశ్నలు వేస్తున్నానన్నారు. చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్– 1. జనరల్ నాలెడ్జికి సంబంధించిన ప్రశ్నలు వేసి వారినుండి జవాబులు రాబట్టారు. విద్యార్థులు క్రీడల తో పాటు చదువులోను రాణించాలన్నారు. అనంతరం స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ దేవసేనమ్మ, ఆర్డీవో కిరణ్ కుమార్ జెండా ఊపి క్రీడలు ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఎంఈవో కాంచన, క్రీడల నిర్వహణ కార్యదర్శి శివకుమార్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవూఫ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంతోనే ఆరోగ్యకర జీవితం



ప్రజాశక్తి - క్యాంపస్ : మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుద్ధంతోని ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించవచ్చని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారిని అధికారి డాక్టర్ డి యువశ్రీ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి సూచనల ప్రకారం సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ రెండు వరకు స్వచ్ఛ హిత సేవా ప్రచార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 14, 15 ప్రోగ్రాం అధికారులు విద్యార్థులచే పరిసరాలను పరిశుభ్రం చేయించారు. విద్యార్థినీ వాలంటీర్లచే పరిశుభ్రత అంశంపై ప్రతిజ్ఞ చేయించారు. ఇంజనీరింగ్ కళాశాల పరిసరాల చుట్టూ గడ్డి మొక్కలను, పిచ్చి మొక్కలను పీకి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు వజీహాబాను, విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో సిబ్బంది కొరత

- పనిభారంతో పలువురు లైన్‌మ్యాన్‌లు, జేఎల్ఎంలు సతమతం



ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం చెరివి విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ సెక్షన్ పరిధిలో సిబ్బంది కొరత ఏర్పడింది. ఈ సెక్షన్ పరిధిలో పలు పోస్టులు భర్తీ కాకపోవడంతో పలువురు లైన్ మ్యాన్లపై పనిభారం అధికమవుతోంది. చెరివి విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ కార్యాలయ సెక్షన్ పరిధికి సంబంధించి సిద్ధమ అగ్రహారంలో ఒక సబ్ స్టేషన్, చెరివి లో రెండు సబ్ స్టేషన్లు, ఇరుగులంలో ఒక సబ్ స్టేషన్ నడుస్తోంది. వీటికి సంబంధించి గృహ సర్వీసులు నాలుగు వేలు, వ్యవసాయ మోటార్లు 900తో పాటు 140 కర్మాగారాలకు విద్యుత్ సరఫరా అవుతున్నట్లు విద్యుత్ అధికారులు పేర్కొం టున్నారు. ఇదే కాకుండా దాదాపు 15 గ్రామాలకు సంబంధించి విద్యుత్ సరఫరా సమస్యలను ఇక్కడ సిబ్బంది చూడాల్సి ఉంది. పైగా ఈ విద్యుత్ సెక్షన్ పరిధిలో పారిశ్రామికరణ నేపథ్యంలో కొత్త కంపెనీలు నెలకొల్పడం వల్ల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అవుతోంది. అయితే చెరివి అసిస్టెంట్ ఇంజినీరింగ్ కార్యాలయ సెక్షన్‌కు సంబంధించి ప్రస్తుతం ఇద్దరు లైన్ మ్యాన్లు, మరో ఇద్దరు జేఎల్ఎంలు మాత్రమే పనిచే స్తున్నారు. ఇందులో భాగంగా పివిపురం, రాజ గోపాలపురం, చమర్తకండ్రిగ, ఒబుల్ రాజ్ కండ్రిగ, రేపల్లె వాడ, వానెల్లూరు తదితర ప్రాంతాలకు సంబంధించి లైన్‌మెన్ మరణి పనిచేస్తుండగా, ఇరుగులం, మల్లవారిపాలెం పదమర, తూర్పు, సిద్ధమ అగ్రహారం, చెంగంబాకం, రామచంద్రాపురం తదితర ప్రాంతాలకు సంబంధించి పీపీ బాబు లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నారు. అయితే ఈ పరిధిలో ఆరుగురు జేఎల్ఎంలు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలిన నాలుగు పోస్టులు భర్తీకి నోచుకోలేదు. పనిచేస్తున్న ఇద్దరు జేఎల్ఎంలు కూడా లైన్‌మ్యాన్ బాబు పర్యవేక్షణలో పని చేస్తున్నారు. కానీ జూనియర్ లైన్‌మ్యాన్ పోస్టులు భర్తీ కాకపోవడంతో సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ పరిధిలో పనిచేస్తున్న లైన్ మ్యాన్‌పై పనిభారం అధికమై సతమతమ వుతున్నారు. దీంతో పాటు చెరివి అసిస్టెంట్ ఇంజినీరింగ్ కార్యాలయానికి సంబంధించి సబ్ ఇంజినీర్ పోస్ట్ కూడా భర్తీకి నోచుకున్న పాపాన పోలేదు. గత దశాబ్దంగా ఇక్కడ సబ్ ఇంజినీర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో గృహ అవసరాలకు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు, వ్యవసాయ మోటారు కనెక్షన్‌కు సంబంధించి ఆన్‌లైనులో వివరాల నమోదు చేయడం, విని యోగ దారుల నుంచి వస్తు న్న విద్యుత్ సమస్యల పరి ష్కారంలో జాప్యం నెలకొం టోంది. అయితే ఆరునెలల క్రితం సాధారణ బదిలీల్లో ఇక్కడ పరిస్థితులను అంచనా వేయకుండా పుత్తూరు డీఈ చిన్నరెడ్డెప్ప ఇష్టానుసారం వ్యవహరించడం విమర్శలకు దారి తీసింది. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి ఇక్కడ పని చేస్తున్న పలువురిని బదిలీ చేయడంతో పాటు వారి స్థానంలో ఎవరినీ నియమించ పోవడంతో విద్యుత్ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో వినియోగదారులకు అంతు చిక్కడం లేదు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు దీనిపై స్పందించి చెరివి విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ కార్యాలయ సెక్షన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయడంతో పాటు మెరుగైన విద్యుత్ సేవలను అందించడానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదంలో కార్మికుడు మృతి



ఫైల్ ఫోటో

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం మేర్లపాక హరిజనవాడకు చెందిన కె. రవికుమార్ (46) **గూడూరు** పుష్పిట్ స్టీల్ ఫ్యాక్టరీలో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అతను డ్యూటీ కి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుతుండగా వాళ్ల ఫ్యాక్టరీ కి చెందిన వాహనం వెనుక నుండి ఢీకొట్టగా అతను వెనక చక్రం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీహ, సిబ్బంది వెళ్లి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వీరులో ఒకరు బీటెక్, ఒకరు ఇంటర్ చదువుతున్నారు. భార్య ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మేర్లపాక దళితవాడ గ్రామస్తులు కోరుతున్నారు.



ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని పలుచోట్ల ద్విచక్ర చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతను వద్ద నుంచి 34 మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఈస్ట్ డిఎస్పి ఏ సురేంద్ర రెడ్డి తెలిపారు. స్థానికలిపిరి పొలిటిషన్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీలేరు కు చెందిన ఎం వెంకట వేణుగోపాల్ నాయక్ (33) కుప్పంలోని శ్రీ రామ్ ఫైనాన్స్ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహిస్తూ మూడు సంవత్సరాల క్రితం నిలిచిపోయాడన్నారు. జల్సాలు కలవాడు పడిన అతను ప్రతిరోజు పీలేరు నుంచి తిరుపతికి వచ్చి పలుచోట్ల పార్క్ చేసిన ద్విచక్ర వాహనను చోరీ చేసేవాడని తెలిపారు. అతనిపై నిఘా ఉంచిన అలిపిరి సిఐ అబ్బన్న సూచనల మేరకు ఎస్సై రాజశేఖర్ గురువారం ఉదయం జూ పార్క్ రోడ్లను సైన్స్ సెంటర్ వద్ద నిందితున్ని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి వేరే ఆలోచన విలువ చేసే ముప్పై నాలుగు మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. నిందితుడు అరెస్టు సొత్తు స్వాధీనంలో సహకరించిన అధికారులు సిబ్బందిని ఆయన అభినందించారు.

కొత్త వ్యక్తులను నమ్మి మోసపోవద్దు: సిఐ



ప్రజాశక్తి - గూడూరు: ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి కొత్త అవతారమెత్తి హై క్యాటగిరిలో ఉద్యోగం చేస్తున్నానని నమ్మబలికి లక్షలకు వసూల వసూలుకు పాల్పడుతున్న మాయగాళ్లను నమ్మి మోసపోవద్దని ప్రజలకు గూడూరు వన్ టౌన్ సర్కిల్ సిఐ జి హజరత్ బాబు పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలో వన్ టౌన్ సిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణాల్లో కొందరు అజ్ఞాత వ్యక్తులు పోలీస్, డాక్టర్లు, లేబర్ ఆఫీసర్లు, వివిధ ఉద్యోగాల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించి అనేక మోసాలకు పాల్పడుతున్నారని ప్రజలు అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించి బెడద నుంచి రక్షించుకోవాలని సూచించారు. రోడ్లపై పోలీసుల మారువేషాల్లో వాహనాలను ఆపి కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అజ్ఞాత వ్యక్తులను పట్టుకునేందుకు పోలీసు శాఖ పలు జాగ్రత్తలు తీసుకుందని ఆయన తెలిపారు. అలాంటి వ్యక్తులను పట్టుకోవాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని ప్రజలు పోలీసులు సమన్వయంతో ఉన్నప్పుడే ఇలాంటి ఆకృత్యాలను అరికట్ట వచ్చని తెలిపారు. గతంలో మారు వేషాల్లో వచ్చి పల్లెల్లో, పట్టణాల్లో , అజ్ఞాత వ్యక్తులు సంచరిస్తూ ఎన్నో దోపిడీలకు పాల్పడి ప్రజలను బురిడీ కొట్టించినసందర్భాలు ఉన్నాయని ముఖ్యంగా గొలుసు దొంగలు, ఇతర వాహనాల దొంగలు, రైల్వే డిఎస్పి మారువేషంలో ప్రజలను బెదిరించి మారువేషంలో వచ్చి లక్షల వసూళ్లకు పాల్పడి పోలీసులకు చిక్కిన సందర్భాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు ఇలాంటి సంఘటనలు జరిగితే 100 డయల్ యువర్ పోలీస్ నంబరుకు సమాచారం అందిస్తే అలాంటి వారిని వారి భరతం పడతామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులలో భాషపై భయం తొలగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే..



ప్రజాశక్తి -పాకాల: విద్యార్థులలో భాషపై నెలకొన్న భయాన్ని చిన్న తనం నుండి తొలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యా యుల పై ఉందని ఎంఈఓ బాబ్జి అన్నారు. మండలంలోని పోలి శెట్టి గారి పల్లి, దామల చెరువు పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భాష పట్ల పట్టు ఉంటే అప్పుడు భయం లేకుండా చదువుకోవచ్చన్నారు. విద్యార్థికి చదవడం, రాయడం వస్తేచాలు.. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు బాగా అర్థం చేసుకుంటారన్నారు. జగనన్న గోరుముద్ద లో భాగంగా సోమ, బుధ, శుక్ర వారాలలో విద్యార్థులకు చిక్కీలు మంగళ, గురు , శని వారాలలో రాగి జావ ను విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల ప్రధా నోపాధ్యాయులు విధిగా పాఠశాలలో రికార్డ్స్, రిజిస్టర్స్ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు వెంకటాచలం, శారద సిఆర్పి శ్రీనివాసులు పా ల్గొన్నారు.

వైసిపి పాలనలో అన్ని సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే



ప్రజాశక్తి -దొరవారిసత్రం : వైసిపి పాలనలో ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తోందని సూళ్లూరు పేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవ య్య అన్నారు. ఆయన గురువారం దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశం మందిరం లో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా ఆ సమస్య వెంటనే పరిష్కరించే విధంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెరవేరు స్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం గడపగడప మన ప్రభుత్వం అమలు చేస్తుంటే ఆ కార్యక్రమంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఎమ్మెల్యే తెలిపారు.

పారిశుధ్యం పై ప్రత్యేకదృష్టి సారించాలి

గ్రామీణ ప్రాంతంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధికారులకు తెలిపా రు. వర్షాకాలంలో గ్రామాలలో ఎక్కువగా సీజనల్ వ్యాధులు సోకుతా యని, గ్రామాలలో అపరిశుభ్రంగా ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి, డెంగ్యూ, విష జ్వరాలు, మలేరియా జ్వరాలు లాంటివి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పంచాయతీ పాలకులు సంబంధిత అధికారులు గ్రామాలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయ కులు మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, ఎంపీడీవో సింగయ్య , మండల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముద్రలోన్‌లు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముద్ర లోన్లను చేనేత కార్మి కులు సద్వినియోగం చేసు కోవాలని తిరుపతి జిల్లా చేనేత అధికారి ఏడి వెంకట్రామ, డివో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రూరల్ మండలంలోని రామకృష్ణాపురం సచివాలయంలో, గొల్లపల్లి గ్రామం లోని సచివాలయంలో చేనేత కార్మికులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ చేనేత కార్మికులకు వారికి కావలసిన ముడి సరుకులు, వివిధ వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు గ్రూపు లుగా చేరి వారికి కావలసిన వారికి సబ్సిడీ రుణాలు ఇస్తారన్నారు. ముద్ర లోన్ తీసుకుంటే 20 శాతం సబ్సిడీ పొంద వచ్చునని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మునుస్వామి రెడ్డి, వైసీపీ నాయకులు దేవేందర్ రెడి, నేత కార్మికులు పాల్గొన్నారు.

రాములవారి ఆలయ కుంబాభిషేకానికి రూ. 50 వేలు విరాళం



ప్రజాశక్తి -తిరుచానూరు: బ్రాహ్మణపట్టు పంచాయతీ పాతూరులో రాములవారి గుడి కుంభాభిషేకాని హజరైన తిరుచానూరు సర్పంచ్ రామచంద్ర రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తుల అధరాభిమానాలతో కుంభాభిషేకం ప్రత్యేక పూజలో పాల్గొన్న రామచంద్రరెడ్డి ఆలయానికి 50 వేల రూపాయలు విరాళం అందించారు. దీంతో గ్రామ అభివృద్ధి కాంక్షిస్తూ రామచంద్రరెడ్డి అక్కడి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు, అభిమానులు, వైసీపీ నాయకులు ఆయన చొరవకు హర్షించి ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో బ్రాహ్మణపట్టు ఎంపిటిసి బి యోగనందరెడ్డి ముండ్లపూడి సర్పంచ్ సన్యాసి సురేష్ రెడ్డి ,స్థానిక వైసిపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన చలపతిరావు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు ను వైసిపి మండల కన్వీనర్ కె.వి చలపతి రాజు కలిశారు. ఈ సందర్భంగా జయచంద్ర నాయుడు మాట్లా డుతూ వైసిపి నాయకత్వం ఎంతో నమ్మకంతో, ఆశయంతో ఆ పార్టీ అధ్యక్షుడిగా నియమిం చిందని నీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్యకర్తల నుంచి నాయకులు అందరిని కలుపుకొని మంచి నాయకుడిగా ఎదిగి జరగబోయే ఎన్నికల్లో కోనేటి ఆదిమూలంను ఎమ్మెల్యేగా గెలిపించి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. పిచ్చాటూరు మండలంలోని ప్రజలను ఉత్తేజ పరుస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించే విధంగా అధికారులతో వారిధిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్ రాజు, సుబ్రమణ్యం రెడ్డి, త్యాగరాజులు, ప్రభాకరన్, సూరిబాబు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కూడా కల్పించలేమా?

- ముున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా ప్రతినిధుల ఆవేదన - ఎజెండాకు మాత్రమే పరిమితం






ప్రజాశక్తి వెంకటగిరి : తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో ప్రజా ప్రతినిధులుగా గెలిచి కనీస సౌకర్యాలు కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నందుకు బాధపడుతున్నామని మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే 2024 లో ఓటు కోసం ప్రజల వద్దకు వెళ్లలేమని ఛైర్‌పర్సన్‌కు తెలిపారు. గురువారం మున్సిపాలిటీ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశం ఉదయం 11.30 గంటల నుంచి మొదలై మధ్యాహ్నం 4.10 గంటలు వరకు కొనసాగింది. అన్ని వార్డుల కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనరుపై, చైర్‌పర్సన్‌లపై ప్రశ్నల వర్షం కురిపించారు. పోలేరమ్మ జాతరను ఈ సంవత్సరం ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించడం తెలిసి కూడా విద్యుత్ దీపాలు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతులు ప్రారంభించకపోవడం చాలా బాధా కరమన్నారు. పట్టణంలో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉన్నా అధికారుల వర్గ పోరు వల్ల, సిబ్బంది కొరత వల్ల అందులో అధికారుల సఖ్యత కోల్పోవడంతో జాతర సక్రమంగా నిర్వ హించలేమని కౌన్సిలర్లు వాపోయారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో జరుగుతున్నప్పుడు సక్ర మంగా ఉం డేదని ఇప్పుడు సచివాలయ సిబ్బంది సెక్రటరీలకు అప్పగించడం వల్ల సానిటేషన్ కుంటు వ డు తుం ద ని ఎవరి పని వారికి అప్పగించా లని కమిషన రు తో వాదించా రు. మున్సిపాలిటీకి ఆదాయ వనరు లు ఉన్నా వాటిని అధికారులు దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఐదో, ఆరు వార్డుల కౌన్సిలర్లు అన్నారు. భ్రమరాంబ థియేటర్ దగ్గర పిళ్లారి గుడి స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు పన్ను ఎలా వేస్తారని దానికి సమాధానం చెప్పా లంటూ కౌన్సిలర్ తెలిపారు. కమిషనర్ వెంకట రామయ్య ఇష్టానుసారంగా కౌన్సిల్ సభ్యులు ఆమోదాన్ని తెలపక పోయినా కౌన్సిలర్లకు తెలియకుండా పన్నులు వేస్తున్నారని వాపోయారు. మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బంది సెలవులపై వెళ్తున్నారని, ఇద్దరు,ముగ్గురు అధికారులతో ఎలా సమావేశం ఏర్పాటు చేస్తారని, దీనివల్ల మున్సిపాలిటీలో పనులన్నీ ఆగిపోతు న్నాయన్నారు. మొత్తం 16 పనులకు సంబంధించి ఎజెండాను కౌన్సిలర్లు పరిశీలించి వాటిలో కాంట్రాక్టు పేరు లేదనే ఉద్దేశంతో ఒక వర్క్ ను నిలుపుదల చేయాలని రానున్న సమావేశంలో అజెండాలో చేర్చమని కౌన్సిలర్ కౌన్సిలర్లు అందరూ తీర్మానం చేశారు. ప్రతి వార్డులో శ్మశానాలకు దారి లేదంటూ, శానిటేషన్ చేయటం లేదని, లైట్లులేవని, మంచినీటి సదుపాయం కల్పించమని కౌన్సిలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: జెడ్‌పిటిసి



ప్రజాశక్తి -సత్యవేడు: బలవర్ధకమైన పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యప డుతుందని తిరుపతి జిల్లా సత్యవేడు జడ్‌పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ కార్యక్రమ అధికారి కాశీశ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తల పరిచయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎదిగే పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అవస రమన్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోతందని ఆమె గుర్తు చేశారు.దీంతోపాటు గర్భవతులకు, బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో అవసరమైన పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదల వారికి అందుతున్న పోషక ఆహారంతో పాటు మరింత బలవర్ధకమైన ఆహా రం అందేలా చూడాలని విజయ వాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ముందుకు రావడం శుభ పరిణామన్నారు. ఇందులో భాగంగానే మండలంలో తొలి విడతగా ఛారిటబుల్ ఫౌండేషన్ ఐదు గ్రామాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసిందన్నారు. ఈ కేంద్రాల్లో పిల్లలకు మరింత మెరుగైన రీతిలో పౌష్టికాహారం అందించడానికి అవసరమైన అవగాహన సదస్సులు, పౌష్టిక ఆహార లోపాలను సరిదిద్దడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం సరైన పోషక ఆహారం తీసుకోకపోవడం వల్ల ప్రతి గర్భిణీ ఆసుపత్రిలో చేరే పరిస్థితి వస్తోందన్నారు. దీనికి పోగొట్టుకోవడానికి తగిన పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఐసిడిఎస్ అధికారి దేవకుమారి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ముందు జాగ్రత్తలతో నిమ్మలో తెగుళ్ల నివారణ



ప్రజాశక్తి- డక్కిలి: నిమ్మ తోటల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి తెగుళ్లను అరికట్టాలని, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏ డి ఏ భాస్కరయ్య కోరారు. ఆత్మ సహకారంతో డక్కిలి మండలం, తీర్థం పాడులో నిమ్మ రైతులకు ఆయన శిక్షణ ఇచ్చారు. వేరు కుళ్లు, మంగు, ఎండు పుల్ల తెగుళ్ల నిమ్మకు ఎక్కువగా నష్టం కలిగిస్తున్నాయని ఆయన తెలిపారు. భూమిలో అధికంగా తేమ లేదా బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు గాలి ప్రసరణ సరిగా లేని బరువు నేలల్లో వేరుకుళ్ల ఎక్కువగా వస్తుందని తెలిపారు. కిలో ట్రైకోడెర్మా జీవ శిలింద్ర మందు, 90 కిలోల పశువులు ఎరువు, 10 కిలోల వేపపిండి మిశ్రమంను చెట్టు పాదికి 10 కిలోల వంతున వేసి కలిపితే వేరుకుళ్లను అదుపులో ఉంచవచ్చని తెలిపారు. ఈ తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే, నీరు పెట్టిన మరుసటి రోజు లీటరు నీటికి 2 గ్రా. బావిష్టిన్ లేదా 2 గ్రా. కవచ్ ను కలిపిన మందు ద్రావణంతో పాదులను తడిపితే, మొక్కలను తెగులు బారి నుండి కాపాడుకోవచ్చునని వివరించారు. నిమ్మలో మంగు నల్లి నివారణకు లీటరు నీటికి 2 మి.లీ ఓమైట్ లేదా 1 మి.లీ ఒబెరాన్ లేదా 1 మి.లీ ఇధి యాన్ మందులలో ఒక దానిని, పిందెలు గోళి కాయ సైజులో ఉన్న ప్పుడు నుండి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు స్ప్రే చేసుకోవాలని, నిమ్మలో ఎండు పుల్ల తెగులు సోకిన రెమ్మలను కత్తిరించి కాల్చి వేయాలన్నారు. తర్వాత 2 గ్రాములు భావిష్టిన్ లేదా 3 గ్రాములు బ్లైటాక్స్ ను లీటరు నీటిలో కలిపి నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేయాలన్నారు. నిమ్మ తోటలలో జీవన ఎరువుల వినియోగం, కలుపు నివారణ గురించి జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి విజయభారతి, రైతులకు ఆర్ బి కే ల ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించి, సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు, గ్రామ సర్పంచి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

'అమరా'లో జీర్ణకోశ క్యాన్సర్‌కు అత్యున్నత చికిత్స

- అత్యున్నత పరికరాలతో సమిష్టి వైద్య సదుపాయాలు





ప్రజాశక్తి- రేణిగుంట: అమర ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ ద్వారా కాలేయం శస్త్ర చికిత్స విజయవంతంగా చేశామని అమర ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ మునికృష్ణ స్పష్టం చేశారు. గురువారం రేణిగుంట మండలంలోని కరకంబాడి సమీపంలో గల అమర ఆసుపత్రి నందు హాస్పిటల్ యాజమాన్యం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ మునికృష్ణ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సదుపాయాలతో రాయలసీమ జిల్లాల్లో పేరుగాంచిన ప్రముఖ అమర ఆస్పత్రిలో లాప్రోస్కోపిక్ ద్వారా కాలేయంకు శస్త్ర చికిత్స విజయవంతంగా చేశామని ఆనంద వ్యక్తం చేశారు. అమర ఆసుపత్రిలో ఇప్పటికే అనేక రకాల అరుదైన చికిత్సలతో రాష్ట్రంలోనే పేరుగాంచిందని పేర్కొన్నారు. లాప్రోస్కోపిక్ ద్వారా కాలేయంకు శస్త్ర చికిత్స విజయవంతంగా చేసి అమర హాస్పిటల్ మరో ఘనత సాధించిందన్నారు. కడప జిల్లాకు చెందిన రాజశేఖర్ (54) వ్యక్తి కడుపు ఉబ్బరంతో అమర హాస్పిటల్‌కి వచ్చారని తెలిపారు. అతనికి అన్ని వైద్య కాలేయ పరీక్షలు చేశామన్నారు. పరీక్షలలో కాలేయ హేమాంగియోమాగా నిర్ధారణ చేశామన్నారు. లాపరోస్కోపిక్ పద్ధతి ద్వార చాలా క్లిష్టమైన కాలేయానికిసర్జరీ (లివర్ రిసెక్షన్) చేసి, రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్జరీ చేసి కాలేయం నుండి 3.5 కేజీ గడ్డను తొలగించి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కాలేయం శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి అతనికి ప్రాణాలను కాపాడిన అమర ఆసుపత్రి యాజమాన్యానికి రాజశేఖర్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారన్నారు. లాపరోస్కోపిక్ పద్ధతి ద్వార చాలా క్లిష్టమైన కాలేయానికి సర్జరీ చాలా అరుదుగా జరుగుతుందని ఇపుడు తిరుపతిలో అమర హాస్పిటల్ లో ఇటువంటి అడ్వాన్స్ ల సర్జరీ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో ముంబై, ఢిల్లీ, చెన్నై మహా నగరాల్లో ఒకటి రెండు ఆసుపత్రిలో ఇలాంటి లాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తుంటారని ఇప్పుడు రాష్ట్ర రాయలసీమ ప్రజల కోసం అమర ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. అమర ఆసుపత్రిలో జీర్ణకోశ వ్యవస్థలోని ఎలాంటి సమస్యలకైనా క్యాన్సర్ అయిన లాప్రోస్కోపీ ద్వారా చికిత్స చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ మునికృష్ణ, సి ఏ ఓ వేణుగోపాల్, డాక్టర్ హేమంత్, భువనేష్, డాక్టర్ శంకర్ మార్కెటింగ్ మేనేజర్ నరసింహ, అమర ఆస్పత్రి పిఆర్ఓ మునినాథం పాల్గొన్నారు.